సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



తపాలా సేవల్లో మార్పులు..

క్రమంగా తపాలా సేవల్లో మార్పులు జరుగుతున్నాయి. రిజిస్టర్ పోస్టు సేవలను స్పీడ్ పోస్టులో విలీనం చేశారు. 8లో



పూజలు.. అన్నదానాలు

వాడవాడలా కొలువుదీరిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. 9లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లాలోని పలుచోట్ల సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రాసనలు నిర్వహించారు. ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మతల్లి అమ్మవారిని ఖమ్మం జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

పెద్దమ్మతల్లి ఆలయంలో దుకాణాలు, చీరలు పోగు చేసుకోవడం, పూల దండల విక్రయానికి మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ హక్కులు పొందేందుకు వ్యాపారులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

3న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



దామరచర్లలో ముస్తాబవుతున్న సభావేదిక

చండ్రుగొండ : ఈ నెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పర్యటన దాదాపు ఖరారైనట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం తెలిపారు. గత నెల 21, అనంతరం 30న చండ్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామంలో సీఎం పర్యటన ఖరారు కావడంతో ఏర్పాట్లు చేశారు. అయితే అనేక కారణాలతో సీఎం సభ రెండుసార్లు వాయిదా పడింది. మళ్లీ పర్యటన ఖరారైన నేపథ్యంలో బెండాలపాడు గ్రామంతోపాటు చండ్రుగొండలోని హెలీప్యాడ్ వద్ద, దామరచర్ల గ్రామంలో సభాస్థలిలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

కొత్తగూడెం, భద్రాచలంలో ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని భారీ వర్షాల నేపథ్యంలో కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం, భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ఆర్డీఓ పరిధిలో ఉన్న సమస్యలపై కొత్తగూడెంలో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులను అందజేయాలని, భద్రాచలం సబ్ కలెక్టర్ పరిధిలోని సమస్యలపై భద్రాచలంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.

వరదలతో వణుకు



ఇటీవల వచ్చిన గోదావరి వరదకు దెబ్బతిన్న పత్తి చేను

గోదావరి పరీవాహక రైతుల్లో ఆందోళన

- ఇప్పటికే ఒకసారి నీటమునిగిన పంటలు
- ఎగువ ప్రాంతాల వరదతో మళ్లీ పెరుగుతున్న గోదావరి

బూర్గంపాడు: పరీవాహక ప్రాంత రైతులను గోదావరి వరదలు వెంటాడుతున్నాయి. పది రోజుల క్రితం వచ్చిన వరదలకు వేల ఎకరాల్లో నీట మునిగి పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి, కూరగాయలు, అపరాల పంటలకు నష్టం వాటిల్లింది. గోదావరి వరద తగ్గటంతో రైతులు రెండోసారి పత్తి గింజలు వేసుకున్నారు. దూరప్రాంతాల నుంచి వరినారు తెచ్చుకుని నాట్లు వేసుకున్నారు. ఇంతలోనే మళ్లీ గోదావరి వరద పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం భద్రాచలం వద్ద గోదావరి వరద 47.90 అడుగులకు పైగా పెరగటంతో లోతట్టు భూముల్లోకి వరదనీరు చేరింది. దీంతో రెండోసారి సాగు చేసిన పంటలు కూడా నీటమునుగుతున్నాయి. ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ఇంద్రావతి నుంచి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్ట్‌ల నుంచి కూడా నీటిని గోదావరికి వదులుతున్నారు. కూనవరం వద్ద శబరి ఎగపోటుతో గోదావరి వరద కొంతమేర పెరుగుతోంది. దీంతో రైతులు మరింత చెందుతున్నారు. అయితే రెండు రోజులుగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు లేకపోవటం ఒకింత ఊరటనిచ్చినట్లయింది.

నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం

గోదావరి వరదలతో భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎక్కువ నష్టం జరుగుతుంది. భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక(43అడుగులు) దాటితే ఆయా మండలాల్లోని గోదావరి ఒడ్డున వ్యవసాయ భూముల్లోకి వరదనీరు చేరుతుంది. ఒక్కో అడుగు వరద పెరుగుతుంటే వందల ఎకరాల్లో పంట నీటమునుగుతుంది. రెండో ప్రమాదక హెచ్చరిక (48 అడుగులు) దాటితే వరద ముంపు ఎక్కువగా ఉంటుంది. రెవెన్యూ డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో రహదారులపైకి నీరు చేరుతుంది. మూడో ప్రమాద హెచ్చరిక(53 అడుగులకు) వరద చేరితే కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. సుమారు 4 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూముల్లోకి వరద చేరుతుంది. దీంతో పంట నష్టం మరింత పెరుగుతుంది. బూర్గంపాడు మండలంలోని పెదవాగు, దోమలవాగు, పులితేరువాగు, వెదుర్లవాగు, కిన్నెరసాని ప్రాంతాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో గోదావరి 50 అడుగులకు చేరితే రెండువేల ఎకరాల వరకు పంటలు నీటమునుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేస్తున్నారు. వరదలకు పంటనష్టం జరిగితే వెంటనే సాగు చేసేందుకు వరినారు దొరికే పరిస్థితి లేదు. మెట్టపంటలు వేయాలంటే యాసంగి వరి సాగుకు ఇబ్బందికరమవుతుంది. ఇప్పటికే పంటల సాగు ఆలస్యమైందని భావిస్తున్న రైతులను గోదావరి వరదలు మరింత అవస్థ పెడుతున్నాయి. సెప్టెంబర్ వచ్చినా పంటలు సాగు ఆలస్యమవుతుండటం దిగుబడులపై ప్రభావం చూపనుంది. ఖరీఫ్ వరి సాగు ఆలస్యమవుతుండటంతో రెండో పంట యాసంగి వరి సాగు ప్రశ్నార్థకమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద తీవ్రత పెరిగి పంటలు నీటమునిగితే వానాకాలం పంటల సాగు ఆపేసి రెండో పంట సాగుచేసుకునే ఆలోచనలో కొందరు రైతులు ఉన్నారు.

రెండుసార్లు నీటమునిగింది



పది రోజుల క్రితం వచ్చిన గోదావరి వరదకు ఏడెకరాల వరి పంట నీటమునిగింది. ఇందులో రెండెకరాల పూర్తిగా దెబ్బతింది. శనివారం వచ్చిన వరదకు మళ్లీ మునిగింది. మళ్లీ వరినాటు వేయాలంటే నారు లేదు.

–యదమకంటి లింగారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

ఎరువులు వేయలేకపోతున్నాం



పత్తి సాగు చేసి మూడు నెలలు కావస్తోంది. ఎరువులు వేద్దామంటే మళ్లీ గోదావరి కాసుకుని ఉంది. మందు వేశాక వరద వస్తే పంట పూర్తిగా దెబ్బతింటుంది. మందు వేయకపోతే అదును దాటిపోతోంది.

–చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

47.90 అడుగులకు గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి

భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగి తగ్గిన నీటిమట్టం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 47.90 అడుగులుగా నమోదైంది. ఆదివారం ఉదయం 8:54 గంటలకు వరద 48 అడుగులు దాటి ప్రవహించడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం ఉదయం 4 గంటల వరకూ గోదావరి నీటిమట్టం 47.50 అడుగుల వద్ద నిలకడగా కొనసాగింది. అనంతరం 5 గంటల నుంచి స్వల్పంగా పెరుగుతూ 8:54 గంటలకు 48 అడుగులకు చేరింది. దాదాపు ఐదుగంటలపాటు నిలకడగా కొనసాగి, మధ్యాహ్నం 1:05 గంటలకు స్వల్పంగా తగ్గి 47.90 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. రాత్రి 8 గంటల వరకు కూడా గోదావరి నీటిమట్టం 47.90 అడుగుల వద్ద నిలకడగానే ఉంది. సోమవారం తెల్లవారు జామునుంచి భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా ఆగస్టు 20న ఒకే రోజు మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలను దాటి గోదావరి వరద నీరు ప్రవహించింది. 21న 51.9 అడుగులకు చేరుకుని వరద తగ్గుముఖం పట్టింది.

10 రోజులుగా వరద నీటిలోనే సీతమ్మవారి విగ్రహం

దుమ్ముగూడెం : ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు మండలంలో కురుస్తున్న వర్షాలకు పర్ణశాలలోని సీతమ్మవారి నారచీరల ప్రాంతం పది రోజులుగా నీటిలోనే మునిగి ఉంది. ఆలయ సమీపంలోని దుకాణాల్లోకి వరద నీరు చేరింది. పది రోజుల నుంచి వరద తగ్గకపోవడంతో నారచీరల ప్రాంతంలోని సీతమ్మవారి విగ్రహం నీట మునిగే ఉంది. పర్ణశాల ఆలయానికి వచ్చే భక్తులు నారచీరల ప్రాంతం దర్శించుకోకుండానే నిరాశతో వెనుదిరుగుతున్నారు.



వరద నీటితో పూర్తిగా మునిగిన నారచీరల ప్రాంతం

కాళరాత్రికి ఏడాది

గ్రౌండ్ రిపోర్ట్



గతేడాది సెప్టెంబర్ 1న ఖమ్మంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

- గతేడాది ఇదేరోజు ముంచెత్తిన మున్నేరు
- పరీవాహక బాధితులను ఇంకా వీడని భయం
- ఇప్పటికీ పలు చోట్ల ఖాళీగానే ఇళ్లు
- రిటైనింగ్ వాల్ పూర్తయితే గట్టెక్కుతామని నమ్మకం



వెంకటేశ్వర నగర్‌లో వదిలేసిన ఇల్లు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎప్పటిలాగే వారంతా రేపటిపై ఆశలతో నిద్రించారు. కానీ తెల్లారేసరికి వారి కలలు ఛిద్రమయ్యాయి. కాయకష్టంతో నిలబెట్టుకున్న గూడు.. ఇతర సామగ్రిని గంగమ్మ తనలో కలిపేసుకోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. గతేడాది ఆగస్టు 31న మున్నేరు పరీవాహకంలోని మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ తరహా భారీ వర్షం కురవగా మున్నేటికి పోటెత్తిన వరద ఖమ్మం నగరాన్ని ముంచెత్తింది. సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం కల్లా పరీవాహకంలోని సుమారు 60 కాలనీలు నీటమునిగాయి. మున్నేటికి రికార్డు స్థాయిలో వరద వచ్చి నేటి(సోమవారం)తో ఏడాది అవుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

వరద తాండవం

ఎగువన భారీ వర్షాలతో గతేడాది ఆగస్టు 31 అర్ధ రాత్రి నుంచి సెప్టెంబర్ 1 తెల్లవారుజామున 3 గంటల వరకు 19 అడుగులుగా ఉన్న మున్నేరు వరద ఉదయం 11 గంటలకల్లా 36.9 అడుగులకు చేరింది. వరద 36.9 అడుగులు కాదు 41 అడుగులకు చేరిందని అధికారులు ఆ తర్వాత ప్రకటించారు. అనూహ్యంగా వరద రావడంతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలంలోని 60 కాలనీల ప్రజలు కనీస సామగ్రి తీసుకునే వీల్లేకుండానే పునరావాస కేంద్రాలకు వెళ్లారు. వీరిలో అత్యధికంగా రోజువారీ కూలీలే కాగా.. ఇళ్లలో బురద మేటలు వేసి కొన్ని చోట్ల పూర్తిగా, ఇంకొన్ని చోట్ల పాక్షికంగా నేలమట్టమయ్యాయి. పైసా పైసా కూడబెట్టుకుని కొనుక్కున్న గ్యాస్‌స్టౌలు, బియ్యం, మంచాలు, దుప్పట్లు, ఫ్రిడ్జ్‌లు, బీరువాలు తదితర సామగ్రి, దాచుకున్న సొమ్ము తుడిచిపెట్టుకుపోయింది.

వర్షం మొదలైతే భయం

మునుపెన్నడూ లేని రీతిలో గత ఏడాది మున్నేటికి వరద రాగా ప్రభావిత కాలనీల ప్రజలు ఇప్పుడిప్పుడే సాధారణ జీవితానికి అలవాటుపడుతున్నారు. అయినా చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. ఉలిక్కిపడుతున్నారు. ప్రస్తుత వర్షాలతో మళ్లీ ఎక్కడ వరద వస్తుందోనన్న ఆందోళనతో వారిలో కంటి మీద కునుకు కరువవుతోంది. ప్రస్తుతం మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతుండడం కొంత ఊరట కలిగిస్తోంది. కాగా ఒక్కో కుటుంబానికి రూ.16,500 చొప్పున 9,725 మందికి రూ.15.60 కోట్ల ఆర్థిక సాయం అందినా 2,170 కుటుంబాలకు ఎదురుచూపులే మిగిలాయి.

ఖాళీగా దర్శనమిస్తూ..

మున్నేరు పరీవాహక ప్రాంతంలోని అనేక ఇళ్లకు ఇంకా టు – లెట్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఏటి సమీపాన దెబ్బతిన్న ఇళ్లకు కొందరు మరమ్మతు చేయించకుండానే వదిలేశారు. ఇళ్లలో ఉంటున్న వారు కూడా పైపై మరమ్మతులు చేయించుకుని.. ఏవైనా కార్యాలు ఉంటే రంగులు వేయించుకుంటున్నామని చెబుతున్నారు.

రూ.లక్షల నష్టానికి రూ.వేల పరిహారం



మా ఆయనకు ఆరోగ్యం బాగుండక నేనే పనికి వెళ్తున్నా. వరదలతో రూ.1.50లక్షల సామగ్రి నష్టపోతే వచ్చిన రూ.10వేలు ఎటూ సరిపోలేదు. ఇంటి మరమ్మతుకు అప్పు చేయలేకపోయాం.

– మామిళ్ల అంజమ్మ, వెంకటేశ్వరనగర్, ఖమ్మం

పాడైన ఇల్లు బాగు చేయించలేదు..



వరదకు మా ఇల్లు మునిగి చుట్టూ గోడలు కూలిపోయాయి. ఈ ఏడాది మళ్లీ వరద వస్తుందని గోడలు కట్టించలేదు. రంగులు వేయించలేదు. కరకట్ట కట్టాక ఇక్కడ ఉండాలో, లేదో చూస్తాం.

– ఇమ్మడి అరుణ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, కరుణగిరి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ నెల 3వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, పాఠశాలలో ప్రగతి ఆధారంగా అవార్డులకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ఆయిల్‌ఫెడ్ రికార్డ్!

గతేడాది కంటే అధికంగా ఆయిల్‌పామ్ గెలల దిగుబడి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ తోటల సాగు విస్తరిస్తోంది. ఈ ఏడాది తోటల నుంచి గెలల దిగుబడి మొదలైన నేపథ్యంలో గతంలో నమోదైన రికార్డులను సైతం అధిగవిస్తోంది. రాష్ట్రంలోని 8 జిల్లాలతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు ముదురు, లేత పామాయిల్ తోటల నుంచి దిగుబడి పెరిగింది. అశ్వారావుపేట, దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలకు జూలైలో 38,341.100 మెట్రిక్ టన్నులు రాగా, ఆగస్టులో 9,291.135 మెట్రిక్ టన్నుల గెలలు వచ్చాయి. రెండు నెలల్లో మొత్తం 47,632.235 మెట్రిక్ టన్నుల గెలలు ఫ్యాక్టరీకి చేరాయి. గతేడాది ఇదే కాలంలో 35,810 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. గతంకంటే ఈ సారి దిగుబడి భారీగా పెరగడంతో కొత్త రికార్డు సృష్టించినట్లయింది.



పామాయిల్ గెలలు

పెరగనున్న గెలల ధర?

పామాయిల్ టన్ను గెలల ధర మరోసారి స్వల్పంగా పెరగనున్నట్లు తెలిసింది. గత నెలలో టన్ను రూ.18,052 ఉండగా, తాజాగా రూ.1000లోపు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల కంటే ముడి పామాయిల్ టన్ను ధరతోపాటు గెలల దిగుబడి పెరగడంతో ఆగస్టు నెలకు సంబంధించి టన్ను ధర పెరిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. పెంపునకు సంబంధించిన జీఓ సోమవారం జారీ కానున్నట్లు తెలిసింది.

కొత్త కార్డులకు బియ్యం..

- నేటి నుంచి రేషన్ దుకాణాల్లో పంపిణీ
- జిల్లాలో 20,084 నూతన కార్డులు మంజూరు
- 236 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెంపు



రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం నేపథ్యంలో వరదలు వస్తే రేషన్‌షాపుల నుంచి బియ్యం తీసుకోవడం కష్టతరంగా మారవచ్చనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గత జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ బియ్యం ముందస్తుగా ఒకేసారి అందజేసింది. మూడు నెలల తర్వాత మళ్లీ సోమవారం నుంచి రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గోదాంల నుంచి కొన్ని రేషన్‌షాపులకు బియ్యం చేరగా, మరికొన్ని దుకాణాలకు రేపటి లోగా చేరే అవకాశం ఉంది. నేటి నుంచే పంపిణీ కూడా ప్రారంభించనున్నారు. గత జూలైలో కొత్త రేషన్‌కార్డులు జారీ చేశారు. అదే క్రమంలో అనర్హులవంటూ 3,390 కార్డులను రద్దు చేశారు. గత మూడు నెలల్లో జిల్లావ్యాప్తంగా 20,084 కొత్త కార్డులను జారీ చేయగా, 36,409 మంది లబ్ధిదారులు అదనంగా పెరిగారు. దీంతో సెప్టెంబర్‌లో 236 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. కొత్త కార్డులను పంపిణీ చేసే కార్యక్రమాలు సైతం చేపడుతున్నట్లు వివరించారు. కాగా పలువురు అర్హులు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు.

కమీషన్ జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బియ్యం పంపిణీ చేస్తున్నందుకు రేషన్ డీలర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా కమీషను చెల్లిస్తాయి. ఐదు నెలలుగా కమీషన్ చెల్లింపులు నిలిచిపోవడంతో సోమవారం నుంచి నిరసన తెలపాలని, రేషన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి డీలర్ల అకౌంట్లలో కమీషన్ జమ చేసింది. కాగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ కూడా చెల్లించాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.

బ్లాక్ మార్కెట్‌కు తరలిందే అధికం

ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి జూన్‌లో పంపిణీ చేసింది. మూడు నెలలవి ఒకేసారి ఇవ్వడంతో దొడ్డు బియ్యం వచ్చాయంటూ డీలర్లు.. షాపులో ఒక బస్తా దొడ్డు బియ్యం చూపడంతో లబ్ధిదారులు తీసుకోకుండానే వెనుదిరిగారు. డీలర్లు బియ్యానికి బదులు లబ్ధిదారులకు నగదు అందజేసినట్లు తెలుస్తోంది. అనంతరం సన్నబియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. గతంలో కిలోకు రూ.5 నుంచి రూ.7 వరకు చెల్లించి లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కేజీకి రూ.10 కంటే ఎక్కువగా చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సన్నబియ్యం పంపిణీ చేస్తున్నా దందా మారలేదనే ఆరోపణలు వస్తున్నాయి. బియ్యం బ్లాక్ మార్కెట్ తరలకుండా జిల్లా సివిల్ సప్లై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా రేషన్‌కార్డు వివరాలు ఇలా..

రేషన్‌షాపులు	443
ఆహారభద్రత	2,72,112
అంత్యోదయ	21,148
అన్నపూర్ణ	03
మొత్తం	2,93,263
కొత్తగా మంజూరైనవి	20,084
ప్రతినెలా పంపిణీ చేసే బియ్యం	5,384.762 (మెట్రిక్ టన్నులు)

బియ్యం కోటా పెరిగింది



జిల్లాలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు కావడంతో ఈ నెల 236 ఎంటీఎస్ కోటా అదనంగా పెరిగింది. మూడు నెలల తర్వాత తిరిగి సోమవారం నుంచి రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. గతంలో ఉన్న లబ్ధిదారులు, ప్రస్తుతం కొత్తగా మంజూరైన కార్డు లబ్ధిదారులు తీసుకెళ్లాలి.

–రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

క్లుప్తంగా

పాల్వంచ జీసీసీ బీఎంగా లక్ష్మణ్


వి.లక్ష్మణ్

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పాల్వంచ బ్రాంచ్ మేనేజర్‌గా దమ్మ పేట జీసీసీ గోదాము ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వి.లక్ష్మణ్‌ను నియమించినట్లు డీఎం సమ్మయ్య ఆదివారం తెలిపారు. ఇప్పటివరకు బీఎంగా పనిచేసిన నర్సింహారావు ఆదివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనస్థానంలో లక్ష్మణ్‌కు ఉద్యోగోన్నతి కల్పించి, బీఎంగా నియమించినట్లు వెల్లడించారు. అలాగే, ఇల్లెందు బ్రాంచ్ మేనేజర్‌గా అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.భూషయ్యను ఉద్యోగోన్నతిపై నియమించినట్లు డీఎం చెప్పారు. ఇద్దరు జీఎంలు సోమవారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

భద్రగిరిలో నిమజ్జనాలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో గణపతి విగ్రహాల నిమజ్జనాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంతోపాటు సమీప గ్రామాల్లో ఐదు రోజులు పూజలందుకున్న గణనాథులను ఊరేగింపుగా మేళతాళాలతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించి భద్రాచలంలో నిమజ్జన ఘాట్‌కు తీసుకొచ్చారు. ఘాట్‌లో సిబ్బంది విగ్రహాలను లాంచీల ద్వారా నదిలో నిమజ్జనాలు నిర్వహించారు. కాగా అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది విగ్రహాల నిమజ్జనానికి నగదు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నేడు పదోన్నతి పత్రాల అందజేత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేసే 356 మంది కార్మికులకు సెప్టెంబర్ 1న సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ కింద పదోన్నతి పత్రాలు అందజేయనుంది. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో – 31, కొత్తగూడెం ఏరియాలో – 35, ఇల్లెందు ఏరియాలో – 13, మణుగూరు ఏరియాలో – 26, ఆర్జీ–1లో – 26, ఆర్జీ–2లో – 41, ఆర్జీ–3 ఏరియాలో – 16, భూపాలపల్లి ఏరియాలో – 42, శ్రీరాంపూర్ ఏరియాలో – 68, మందమర్రి ఏరియాలో – 40, బెల్లంపల్లి ఏరియాలో – 11, ఎస్‌టీపీపీలో –7 మందికి పత్రాలు అందించనున్నారు.

ఈ నెల 10, 11 తేదీల్లో కేటీఆర్ పర్యటన


మాట్లాడుతున్న రేగా కాంతారావు

పాల్వంచ: ఈ నెల 10, 11 తేదీల్లో మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 10వ తేదీన కొత్తగూడెం, పాల్వంచలో, 11న రోడ్‌షో ద్వారా భద్రాచలం, మణుగూరులో పర్యటిస్తారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మంతపురి రాజుగౌడ్, విశ్వనాథం, కిలారు నాగేశ్వరరావు, దాసరి నాగేశ్వరరావు, సీతారాములు, కాంపెల్లి కనకేశ్, మడివి సరస్వతి, సింధు తపస్వి, భట్టు మంజుల, చందునాయక్, సురేశ్ పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన గిరిజన యువతి



తల్లి సుజాతతో దేవికనందన

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన చీమల దేవికనందన గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఐఐటీ ర్యామ్ ఇనిస్టిట్యూట్‌లో సీటు సాధించింది. అంతదూరం వెళ్లే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆమె మేనమామలు సారయ్య, భద్రయ్య చేయూతనందించారు. అమ్మానాన్నలు చీమల సైదులు, సుజాతతో కలిసి అహ్మదాబాద్‌లోని ఐఐటీ ర్యామ్ ఇనిస్టిట్యూట్‌కు వెళ్లిన దేవికనందన శనివారం ప్రవేశం పొందింది. దేవికనందనను గ్రామస్తులు అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలో వేర్వేరు పత్రికల్లో రిపోర్టర్లుగా పనిచేస్తున్న బోడపట్ల సతీష్, పోలెపొంగు నాగరాజుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద శనివారం ఇద్దరూ ఘర్షణ పడ్డారని, ఈ క్రమంలో ఇరువురూ పరస్పరం ఫిర్యాదు చేయగా ఇద్దరిపైనా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

తపాలా సేవల్లో మార్పులు..

- పాత సేవలను రద్దు చేస్తూ అధునాతన విధానాలు అమలు
- నేటి నుంచి రిజిస్టర్ పోస్టు సేవలు స్పీడ్ పోస్టులో విలీనం
- పోస్టుబాక్స్‌ల ఎత్తివేతపై ప్రచారం





ఖమ్మంగాంధీచౌక్: తపాలా సేవల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక సాంకేతిక విధానాలతో తపాలా శాఖ దూసుకుపోతోంది. అధునాతన సాంకేతిక విధానాలను అవలంభిస్తూ ఈ– సేవలను విస్తరిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలాశాఖ అనేక మార్పులను తీసుకువస్తోంది. సేవలను వేగవంతంగా, ప్రైవేట్ సంస్థలకు పోటీగా నిర్వహించటం కోసం అధునాతన సాంకేతిక విధానాల అమలుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. అంతేగాక పూర్వకాలం నాటి ఉత్తరాల బట్వాడ, మనియార్డర్ వంటి సేవలే గాక ప్రజల సౌకర్యార్థం అనేక రకాల సేవలు, ప్రభుత్వ పథకాలను తపాలా శాఖ అందిస్తోంది. అందులో భాగంగా పాత విధానాలను కొద్దిగా రద్దు చేస్తూ మరికొన్నింటిలో మా ర్పులు తీసుకొస్తూ.. నూతన విధానాలను అమలు చేస్తోంది. మొబైళ్లు, ఇంటర్నెట్ సేవలు లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలా శాఖ. అయితే పెరిగిన సాంకేతికతకు అనుగుణంగా తపాలాశాఖ అప్‌గ్రేడ్ అవుతోంది. తాజాగా రిజిస్టర్ పోస్టు సేవా విధానాన్ని మార్చింది. పోస్టు బాక్సుల ఎత్తివేత అంశం తెరపైకి వచ్చింది.

ఇక స్పీడ్ పోస్టులే..

రిజిస్టర్ పోస్టు సేవలకు తపాలా శాఖ మంగళం పాడుతోంది. సెప్టెంబర్ 1 (సోమవారం) నుంచి ఈ సేవలను నిలిపి వేస్తున్నట్లు తపాలా శాఖ ఇప్పటికే ప్రకటించగా.. పోస్టల్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రిజిస్టర్ పోస్టు సేవలను పూర్తిగా స్పీడ్ పోస్టు సేవలో విలీనం చేశారు. దేశీయ పోస్టల్ సేవల క్రమబద్ధీకరణ, పనితీరును మెరుగుపర్చటం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయటం వంటి ప్రక్రియలో భాగంగా స్పీడ్ పోస్టులో రిజిస్టర్ పోస్టును విలీనం చేస్తునట్లు సంస్థ ప్రకటించింది. స్పీడ్ పోస్ట్ అంటే వేగవంతమైన డెలివరీ. స్పీడ్ పోస్టు ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందనే విషయాన్ని ఆన్‌లైన్‌లో గుర్తించవచ్చు. ఇది రిజిస్టర్ పోస్టు సేవల్లో లేదు. కాగా, రిజిస్టర్ పోస్టుల వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సప్, జీ–మెయిల్ వంటి డిజిటల్ సేవలు అందుబాటులోకి రావటంతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాయి. అంతేగాక కొరియర్ వ్యవస్థ పెరిగింది. ఈ ప్రభావం కూడా రిజిస్టర్ వ్యవస్థపై పడింది. గతంతో పోలిస్తే రిజిస్టర్ పోస్టు సేవల వ్యవస్థ ఏకంగా 25 శాతం పడిపోయిందని తపాలా ఉద్యోగులు చెబుతున్నారు.

పోస్టు బాక్సులు కనిపించవా..?

వందల ఏళ్ల చరిత్ర కలిగిన పోస్టు బాక్సుల ఎత్తివేతపై ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాల్లో ఈ అంశం చక్కర్లు కొడుతోంది. దశాబ్దాలుగా నిస్వార్థంగా, నిశ్శబ్దంగా, నిశ్చలంగా, విశ్వసనీయంగా సేవలందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించదన్న బాధ పలువురిలో వ్యక్తమవుతోంది. అయితే ఈ అంశంపై తమకు సమాచారం లేదని, పోస్టు బాక్సుల ఎత్తివేత అవాస్తవమని అధికారులు కొట్టిపారేస్తున్నారు.

మార్గదర్శకాలను పాటిస్తాం



రిజిస్టర్ పోస్టు సేవలను స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారు. తపాలాశాఖ మార్గదర్శకాలను అనుసరించి సేవలను అందిస్తాం. అధునాతన సాంకేతిక విధానాలతో సేవలను వేగవంతం చేయటం కోసం తపాలా సేవల్లో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పోస్టు బాక్సుల ఎత్తివేత ఊహాగానమే. ఎలాంటి ఆదేశాలు లేవు. –వి.వీరభద్రస్వామి, పోస్టల్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

కిన్నెరసానిలో సండే సందడి


కిన్నెరసానిలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

ఒకరోజు ఆదాయం రూ.30,655

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా పోటెత్తారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 448 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20,835, 120 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.9,820 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సందర్శించిన ఖమ్మం జడ్జి..

కిన్నెరసాని రిజర్వాయర్‌ను ఖమ్మం జిల్లా న్యాయమూర్తి రాజగోపాల్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. డీర్‌పార్కులో దుప్పులను, జలాశయాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు.

ఒక గేటు ఎత్తివేత..

ఎగువన కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలయాశానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1000 క్యూసెక్కుల వరద రావడంతో ఆదివారం నీటిమట్టం 405.10 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేటు ఎత్తి మూడు వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు 38 పతకాలు


క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, పాలమూరు యూనివర్సిటీ స్టేడియంలో శనివారం ముగిసిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు 38 పతకాలు వచ్చాయి. ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ వివరాలు వెల్లడించారు. జిల్లా నుంచి 30 మంది పలు కేటగిరిల్లో పాల్గొని 38 పతకాలు (బంగారు పతకాలు–11, రజత పతకాలు–17, కాంస్య పతకాలు–10) సాధించారన్నారు. పినపాకకు చెందిన తోలేం శ్రీతేజా 200 మీటర్ల పరుగుపందెం, హైజంప్‌లో రెండు బంగారు పతకాలు, భద్రాచలానికి చెందిన ఎం.శ్రీవిద్యాధార 80 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకం, కొత్తగూడెంనకు చెందిన జరుపుల దీక్షిత్ 60 మీటర్లు పరుగుపందెంలో బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, నాగపూరి రమేశ్, గొట్టపు రాధాకృష్ణ, జె.నాగేందర్, గిరిప్రసాద్, డి.మల్లికార్జున్, నాగరాజు, ప్రసాద్ అభినందించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ పోటీలు


పోటీదారులతో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

కొత్తగూడెంఅర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా క్రీడాల శాఖ ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు.
పోటీలను కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ప్రారంభించి మాట్లాడారు. యువత చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.

పొట్టేలు చోరీ

కారేపల్లి: ఇంటి ఆవరణలోని గొర్ల షెడ్డులో నుంచి పొట్టేలును ఇద్దరు వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలోని గొర్లషెడ్డులోకి శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి.. రూ.25 వేలు విలువ చేసే పొట్టేలును చోరీ చేశారు. అలికిడి రావటంతో అనుమానం వచ్చిన వెంకటేశ్వర్లు పరిశీలించగా పొట్టేలు కనిపించలేదు. ద్విచక్రవాహనంపై గ్రామంలో కలియతిరగగా.. శివ, సురేశ్ ద్విచక్రవాహనంపై తిరగటం గమనించి, వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పటంతో పాటు, వారి చొక్కాపై పొట్టేలును ఎత్తుకున్న ఆనవాళ్లు కనిపించాయి. ఆదివారం కారేపల్లి పోలీసులకు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకొని, దాచిపెట్టిన పొట్టేలును పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించారు. ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్‌తో లాభం

సత్తుపల్లి: మండలంలోని పాకలగూడెంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్‌తో రైతులకే లాభం ఉందని ఆయిల్‌పాం రైతులు చీకటి చిట్టీరావు, పొన్నగంటి జోగారావు తెలిపారు. మండలంలోని కిష్టాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌పాం కలెక్షన్ సెంటర్ కోసం పలుమార్లు విన్నవించుకోగా ఆయిల్‌ఫెడ్ కమిటీ పరిశీలించి అనుమతి ఇచ్చిందని, దీంతో సత్తుపల్లి మండలంలోని ఆయిల్‌పాం రైతులకు గెలలు ఫ్యాక్టరీకి పంపించటం తేలికైందన్నారు. సమావేశంలో రైతులు హసావత్ కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.లోకేశ్వరరావు, దేవరపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

కలుపుమందు కలిసిన నీళ్లు తాగి అస్వస్థత


చికిత్స పొందుతున్న కూలీలు

టేకులపల్లి: కలుపు మందు కలిసిన నీటిని తాగడంతో 15 మంది అస్వస్థతకు గురైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన రైతు జాటోతు రాజు ఆదివారం తన చేనులో మిర్చి నారు వేసేందుకు 14 మంది కూలీలను పిలిపించాడు.
పనిచేస్తున్న క్రమంలో కూలీలు తాగునీరు అడగటంతో రైతు అప్పటికే కలుపు మందు వాడిన బిందెలోనే తాగునీరు తీసుకుని వచ్చి తాను తాగడంతో పాటు కూలీలకు ఇచ్చాడు. ఆ నీటిని తాగిన కొంత సేపటికి తొలుత నూనావత్ అంజలి, జాటోతు జ్యోతి, ధరావత్ గాయత్రి, జాటోతు దేవి వాంతులు చేసుకుని కళ్లు తిరిగి కిందపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవగా మిగతా వారు కూడా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆ నలుగురితో పాటు రైతు జాటోతు రాజు, కూలీలు జాటోత్ పార్వతి, ధరావతు సునీత, దరావత్ శంకర్, దారావత్ సంతు, ధారావత్ సింధు, ధారావతు సరోజ, జాటోతు సునీత, జాటోతు దశ్‌సింగ్, అంగోత్ పద్మ, జాటోతు బాలను స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరంతా చికిత్స పొందుతున్నారు.

గణేశ్ శోభాయాత్రలో అపశ్రుతి

మణుగూరుటౌన్: గణేశ్ ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. ఉత్సాహంతో డీజే మోతలకు డాన్స్ చేస్తున్న మహిళ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి గుట్టమల్లారంలోని జయశంకర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న క్రమంలో రాసమళ్ల ప్రమీల (45) డీజేను అనుకరిస్తూ నృత్యం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలింది. అక్కడున్న వారు బాధితురాలిని స్థానిక 100 పడకల ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్

ఇల్లెందు: పట్టణంలోని ఇల్లెందు చెరువు కట్ట వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని ముత్తారపుకట్ట గ్రామానికి చెందిన పొడెగు సంపత్, మిట్టపల్లి దొనబండగుంపునకు చెందిన సూర్నపాక మహేశ్ గంజాయి సేవిస్తూ ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోటమైసమ్మ ఆలయం వద్ద పొడుగు వరుణ్ తమకు గంజాయి తాగటం అలవాటు చేశాడని వారు తెలిపారు. అయితే, పొడుగు వరుణ్‌కు జేకేకాలనీకి చెందిన ప్రవీణ్‌పాసీ గంజాయి సరఫరా చేసినట్లు తెలిపాడని అరెస్టయిన వారు విచారణలో తెలిపారు.

యువకుడి అదృశ్యం


సిద్ధి రవికుమార్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామానికి చెందిన సిద్ధి రవికుమార్ 5 రోజులుగా కనిపించడం లేదని, దీనిపై కేసునమోదు చేశామని ఆదివా రం సీఐవెంకటప్పయ్య తెలిపారు. సిద్ధి రవికుమార్ గత ఆగస్టు 26వ తేదీ సాయంత్రం తన మిత్రుడు దాస రి ప్రశాంత్ ఇంటికి వెళ్లి, అక్కడే భోజనం చేసి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదని, అతడికి అప్పుడప్పుడూ ఫిట్స్ వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు. రవికుమార్ భార్య సిద్ధి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అదృశ్యంపై ఆదివారం ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలీ) పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్సార్ కాలనీలో నివసించే పొట్లపల్లి నారాయణ(45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఆటోతో ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం తన భార్యకు ఫోన్ చేసి తన మనసు బాగోలేదని చెప్పి కాల్ కట్ చేశాడు. తిరిగి ఆమె ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. బంధువులతో కలిసి గాలించగా నగర శివారు ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని సాగర్ ప్రధాన కాల్వ పక్కన ఆటో నిలిపి ఉంది. నారాయణ కనిపించకపోవడంతో భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఆటో బోల్తా డ్రైవర్ మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోయి ఆటో బోల్తా కొట్టడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటనపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపూరం గ్రామానికి చెందిన చిర్రా నరేశ్ (29) శనివారం రాత్రి సమయంలో సుబ్లేడు అత్తగారింటికి తన సొంత ఆటోలో వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోగా ఆటో రోడ్డు పక్కకు పల్టీకొట్టింది. నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిని కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

- దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు పాలన సాగిస్తున్నాయి
- ఓట్ల చోరీపై నేడు పాట్నాలో నిరసన ర్యాలీ
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న ప్రదీప్ సింగ్ ఠాగూర్

ఖమ్మంమయూరిసెంటర్ : ఏకీకృత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నుతున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు ఖమ్మంలో మాస్‌లైన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించామని, దేశంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలు, మతోన్మాదం పేరుతో సాగిస్తున్న హింస, ఓట్ల చోరీపై చర్చించామని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్నాయని, లౌకికతత్వాన్ని, సర్వమత సహజీవన సమాజాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో లక్షలాది మంది బలహీన వర్గాల వారి ఓటు హక్కు రద్దు చేశారని అన్నారు. దీనికి నిరసనగా నేడు(సోమవారం) పాట్నాలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, మహిళలు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి దిగుమతిపై సుంకం రద్దును డిసెంబర్ 31 వరకు అమెరికా పొడిగించిందని, ఇది రైతులకు ప్రమాదకరమని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. వర్షాలు కురిసి పంటలు సాగు చేసే సమయంలో రైతులకు యూరియా అందకుండా పోతోందని, యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవగాహన లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో పంచాయతీలకు నిధులు మంజూరు కావడం లేదని, దీంతో గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి సుభాష్ దేవ్, కేంద్ర కమిటీ సభ్యులు దేవవ్రత శర్మ, కేజీ రామచందర్, కె.రమణ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఉమాకాంత్, పూజారి కృష్ణ గోగోయ్, భిమల్ పాండే, వి.కృష్ణ, కె.సూర్యం, సి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలతో భయాందోళనలో ప్రజలు


కర్రలతో కాపలా కాస్తున్న స్థానికులు

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువులోపదిరోజులుగా కుక్కలు అర్ధరాత్రి ఇళ్లల్లోకి వచ్చి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి సమయాల్లో కుక్కలు మంచాల కింద చేరడం, పిల్లల పక్కన చేరు తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రంతా నిద్రాహారాలు మాని కంటి మీద కునుకు లేకుండా కర్రలు పట్టుకొని కుక్కలు ఇంట్లోకి రాకుండా కాపలా కాస్తున్నారు. అవి పిల్లలు, వృద్ధులను ఎక్కడ కరుస్తాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైలుకింద పడి వృద్ధురాలు మృతి

ఎర్రుపాలెం: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఓ వృద్ధురాలు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన మిద్దె మేరమ్మ (72) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రైల్వేస్టేషన్‌కు చేరుకుని గూడ్సు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు

ఖమ్మంఅర్బన్: నగర పరిధి లోని గోపాలపురం వద్ద ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొట్టగా మహిళ మృతిచెందగా.. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నా యి.. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన పొలిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మి (45) దంపతులు ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. గోపాలపురం వద్దకు రాగానే ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న భద్రాచలం డిపో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో లక్ష్మి ఘటనా స్థలంలోనే మృతిచెందింది. గాయపడిన వెంకటేశ్వర్లును 108ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ మావద ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, LLB, B.Tech, ITI, డిప్లొమా, ఫార్మసీ, BAMS, MBBS, BPT, D.MLT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర 99481 31154 [SCA 25007755]

Real Estate

HOUSE FOR SALE

■ ఖమ్మం, డీలక్స్ హౌసెస్ ఇల్లందు రోడ్‌లో 75, వరంగల్ రోడ్‌లో 60, హైదరాబాద్ రోడ్‌లో 50, కోదాడ రోడ్‌లో 70 లక్షలకు 90% బ్యాంక్ లోన్స్. ఫోన్: 75696 18430 [SCA25007718]



Wanted

■ ఖమ్మం ఇంద్రానగర్ లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. శాలరీ : 17,000/– సంప్రదించు సెల్ నెం. : 6304719869 [SCA25007754]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.